క్లుప్తంగా

కొనసాగుతున్న సామాజిక పరిశీలన



రావులపల్లిలో క్రీడా ప్రాంగణ పనులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పనుల్లో నిర్వహించిన పనులకు సంబంధించి వివరాలను సామాజిక తనిఖీ బృందం పరిశీలిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో సామాజిక తనిఖీ బృందం క్రీడా ప్రాంగణంతోపాటు వివిధ పనులకు సంబంధించి వివరాలను సేకరించారు. అనంతరం ఆయా పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాములు, ఎస్ఆర్పీ జీవన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్



మాట్లాడుతున్న శేఖర్

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం లగచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అన్ని వర్గాలకు, మతాలకు పుట్టినిల్లు అని అన్నారు. కుల, మత, వర్గ అనే భేదం లేకుండా నామినేటెడ్ పోస్టులు, ఇతర సీట్లు సమన్యాయంగా కేటాయించిందన్నారు. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు దీనికి ఉదాహరణగా తీసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా తుల్జాభవానీ పూజలు



పూజలో తుపాకుల తండావాసులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం తుపాకులతండాలో మంగళవారం తుల్జాభవానీ మాత ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలతో భక్తులు తుల్జాభవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమను, తమ కుటుంబీకులను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

వేసవి పంటలపై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయాధికారులు

బొంరాస్‌పేట: వేసవి పంటలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన అవగాహన సదస్సులో ఏఆర్ఐ శాస్త్రవేత్తలు వీడియోకాన్ఫరెన్స్‌లో వివరించారని ఏఓ తులసి తెలిపారు. ఇందులో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, ఏడీఏ శంకర్, ఏఈఓలు శైలజ, స్వాతి, జగదీశ్, పవన్, వసీం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ సర్పంచును పరామర్శించిన రోహిత్‌రెడ్డి



మల్లీశ్వరిగౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ మాజీ సర్పంచు మల్లీశ్వరిగౌడ్ అత్త రాజమ్మ నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మంగళవారం చెంగోల్ గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, భద్రేశ్వరస్వామి దేవాలయ ఈవో శేఖర్‌గౌడ్, నాయకులు గౌడి వెంకటేశం, ఉమా శంకర్ పటేల్, రాకేష్‌గౌడ్, నర్సిరెడ్డి ఉన్నారు.

లక్ష్యం.. నూరుశాతం



గ్రామ పంచాయతీ కార్యాలయం

- 15రోజుల్లో మొత్తం వసూలు చేయాల్సిందే
- ఆదేశాలు జారీ చేస్తున్న అధికారులు
- 28గ్రామ పంచాయతీల్లో 77శాతం పూర్తి
- ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి పూర్తిచేస్తాం : ఎంపీఓ

మోమిన్‌పేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో 100శాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక 15రోజులు గడువు మాత్రమే మిగిలి ఉంది. 2024–2025 సంవత్సరానికి గాను మండలంలోని 28 గ్రామ పంచాయతీలోపన్నుల వసూళ్ల డిమాండ్ రూ.95,78,261లు ఉండగా ఏడు గ్రామ పంచాయతీలు అంరాధికుర్దు, బాల్‌రెడ్డి గూడెం, చిన్న కోల్కుంద, ఇజ్రా చిట్టంపల్లి, సయ్యద్‌అల్లిపూర్, చీమల్‌దరి, ఎన్కేపల్లి గ్రామాలలో పూర్తి స్థాయిలో వసూలు చేశారు. మిగత గ్రామ పంచాయతీలలో 70శాతానికి పైగా వసూలయ్యాయి. ఉన్నాతాధికారులు మాత్రం పూర్తిగా వసూలు చేయాల్సిందేనని తాఖీదులు ఇస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. గత సంవత్సర బకాయి రూ.3,53,046లు కూడా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కార్యదర్శులు పేర్కొంటున్నారు. మొత్తం 28 గ్రామ పంచాయతీలలో ఇప్పటి వరకు 77శాతం వసూలు చేశారు. 2022–23 సంవత్సరానికి గాను నూరుశాతం పన్ను వసూళ్లయ్యాయని ఎంపీఓ యాదగిరి పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరంలో కూడా ఎట్టి పరిస్థితిలోనైనా మొత్తం పన్ను వసూలు చేయాలన్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడిల మేరకు వసూలులో రికార్డు నెలకొల్పుతామని ఆయన తెలిపారు. గతంలో కొన్ని గ్రామాల్లో 100శాతం, మరికొన్నింటిలో 80శాతం వరకు వసూలు చేసేవారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొంత సమయం ఉందన్నారు. మోమిన్‌పేట, ఏన్కతల, టేకులపల్లి, మొరంగపల్లి, వెల్‌చాల్, మేకవనంపల్లి గ్రామ పంచాయతీలలోనే మొత్తం డిమాండ్లలో సగానికిపైగా ఈ ఆరు గ్రామ పంచాయతీలలోనే పన్ను వసూల వుతున్నాయి. మొరంగపల్లి పంచాయతీలో 576 కుటుంబాల ఇండ్లు ఉన్న రెండు ఫ్యాక్టరీలు ఉండటంతో పన్నుల డిమాండ్ రూ.14,07,720లుగా ఉంది. వెల్‌చాల్ గ్రామ పంచాయతీలో 511కుటుంబాల ఇండ్లు ఉన్నా అక్కడ కూడా ఒక ఫ్యాక్టరీ ఉండటంతో డిమాండు రూ.7,82,049లు ఉంది. మోమిన్‌పేటలో రూ.21,79,110లు, మేకవనంపల్లిలో రూ.9,27,655లు ఉండగా ఇప్పటి వరకు 91శాతం వసూలు చేశారు. ఈ డబ్బులను ఎప్పటికప్పుడు చలాన్ల రూపంలో పంచాయతీలలో జమ చేస్తున్నామని ఎంపీఓ యాదగిరి తెలిపారు.

విధినిర్వహణలో భాగంగానే..



మండలంలోని 28 గ్రామ పంచాయతీల కార్యదర్శులు పూర్తిస్థాయిలో పన్ను వసూలులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నాతాధికారుల వత్తిడిలు ఉన్నప్పటికీ విధి నిర్వహణలో భాగంగానే వసూలులో నిమగ్నమయ్యారు. ప్రతి రోజు గ్రామాలను సందర్శించడం వల్లే వసూళ్లు సాధ్యమవుతుందన్నారు. 15రోజుల్లో 100శాతం వసూలు చేస్తాం. వసూలు చేసిన డబ్బును ఎప్పటికప్పుడు పంచాయతీ ఖాతాలలో జమచేస్తున్నాం.

– ఎంపీఓ యాదగిరి, మోమిన్‌పేట

అభివృద్ధివైపు కడా అడుగులు



మెట్లకుంట పాఠశాలను పరిశీలిస్తున్న కడా అధికారి, నాయకులు

గ్రామాల్లో పర్యటించిన అధికారి వెంకట్‌రెడ్డి

బొంరాస్‌పేట: కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థ (కడా) అభివృద్ధివైపు అడుగులు వేగవంతం చేసింది. మంగళవారం కడా అధికారి వెంకట్‌రెడ్డి మండలంలోని పలుగ్రామాల్లో ముమ్మరంగా పర్యటించారు. ఆయా గ్రామాల అధికారులు, నాయకుల ఆధ్వర్యంలో పాఠశాలలు, రోడ్లు, తదితర అంశాలపై ఆరా తీశారు. మెట్లకుంటలో పీఏసీఎస్ జయకృష్ణ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలోని పాత భవనాన్ని పరిశీలించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్, చర్చి అర్ధంతరంగా నిలిచి పోయిన గ్రామపంచాయతీ భవనం, బీసీ కమ్యూనిటీహాల్ అంగన్‌వాడీ–2 భవనం మంజూరు చేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న మసీదు పనులు చేయిస్తామన్నారు. కొత్తూరులో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల అదనపు భవన నిర్మాణంతో పాటు పలు పనుల మంజూరుకు సానుకూలంగా స్పందించడంతో హర్షం వ్యక్తం చేశారు. రేగడిమైలారంలో సైన్స్‌ఫేర్‌ను పరిశీలించిన కడా అధికారి ప్రతిభను అభినందించారు. మహంతీపూర్ పాఠశాల భవనాలు, సీసీ రోడ్ల సమస్యల ఏకరువు పెట్టారు. గ్రామానికి అధిక నిధులతో సాగుతున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశం ఆయా గ్రామాల నాయకులు చంద్రప్ప, గుండప్ప, భీంరెడ్డి, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



దీక్ష చేపడుతున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అమలు అనంతరమే గ్రూప్–1, 2, 3 ఉద్యోగ ఫలితాలు, నియామకాలు చేపట్టాలని కోరుతూ వికారాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కూడా దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండా గ్రూప్స్, ఇతర ఉద్యోగ నియామకాలు, పరీక్ష ఫలితాలు విడుదల చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం మాదిగల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు స్వామిదాసు, దప్పు మహేందర్, జైపాల్, రాజు, సూర్యప్రకాశ్, జగదీశ్, పుష్పలతా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు

ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రతన్‌సింగ్



గౌతపూర్‌లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న రతన్‌సింగ్

తాండూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని పంచాయతీ కార్యదర్శులను ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రతన్‌సింగ్ హెచ్చరించారు. మంగళవారం తాండూరు మండలం గౌతపూర్, చెంగోల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రతన్‌సింగ్ మాట్లాడుతూ..పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు గ్రామాల్లో పర్యాటించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వన నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు నీళ్లు పట్టాలన్నారు. ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న వారికే హాజరు వేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏఎస్ఐ పుండరికం



అవగాహన కల్పిస్తున్న పుండరికం

మోమిన్‌పేట: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ పుండరికం పేర్కొన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు చేయడానికి నేరస్థులు ఒక్కో రకమైన దారులను ఎంచుకొంటున్నారన్నారు. బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకొచ్చే క్రమంలో అప్రమత్తంగా లేకపోతే అవలీలగా దొంగలు కొట్టేస్తున్నారన్నారు. ఓటీపీలు చెప్పాలని, ఫోన్లకు లింకులు పంపి ఓపెన్ చేసి చూడాలని, గుర్తు తెలియని వ్యక్తుల మాటలు విని అలా చేస్తే వెంటనే ఖాతాలో ఉన్న డబ్బులు అపహరణకు గురవుతున్నాయన్నారు. ద్విచక్రవాహనాదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, శివకుమార్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఖాంజాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.8లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఖాంజాపూర్ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. కుర్వ మల్లమ్మ ఇంటి నుంచి జక్కెపల్లి అనంతమ్మ ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హన్మంత్, అనంతయ్య, నర్సింహారెడ్డి, మహేష్‌గౌడ్, ఎండీ పాషా, పెద్ద నర్సిములు, షేరిలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కందుకూరు: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ అనిల్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రఘు తదితరులు 75 మంది రోగులకు ఉచిత రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా రిసోర్స్ పర్సన్ రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటు వ్యాధి కాదన్నారు. తెలియని వారితో అక్రమ సంబంధాలతోనే ఆ వ్యాధి సోకే అవకాశం ఉంటుందన్నారు.

బడుగు బలహీన వర్గాలతోనే రాజ్యాధికారం

ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహరాజ్



విగ్రహాన్ని ఆవిష్కరించిన విశారదన్ మహరాజ్

అనంతగిరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్ల గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆర్ అనంతయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలని, బడుగు బలహీన వర్గాల పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలని సూచించారు. విద్యతోనే ఏదైనా సాధ్యమని అంబేడ్కర్ నిరూపించాడని గుర్తు చేశారు. కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించేందుకు అంబేడ్కర్ కంటే ముందే సంత్ కబీర్‌దాస్, శివాజీ మహరాజ్, జ్యోతిరావు పూలే, సాహు మహరాజ్ కృషి చేశారని తెలిపారు. ఎందరో ఆలోచన విధానాలను అర్థం చేసుకుని అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం చేశారని అన్నారు. రాజ్యాంగం అమలులోకి రావడంతో నిమ్నజాతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమానత్వం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి, ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, బీజేపీ నియోజక వర్గ ఇంచార్జి నవీన్ కుమార్, దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ, కేవీపీఎస్ నాయకులు మహిపాల్, దళిత సంఘాల నాయకులు మల్లేశం, దానయ్య, విజయేందర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు విజయేందర్ గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంజూరైన అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కళాశాలకు మంజూరు చేసి ఏడాది గడిచినా నేటికీ భర్తీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లో ఇలా ఉంటే రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వచ్చే అకాడమిక్ సంవత్సరానికైనా అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి



బియ్యాన్ని పరిశీలిస్తున్న భీమ్‌రాజు

దౌల్తాబాద్: వసతి గృహ విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని ఏబీసీడీఓ సహాయక అభివృద్ధి అధికారి భీమ్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవికాలం కావడంతో విద్యార్థులను మధ్యాహ్న సమయంలో బయటకు పంపించొద్దన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వార్డెన్ నిర్మలకు సూచించారు.

నవాబుపేట పీఎస్‌ను సందర్శించిన సీఐ



నవాబుపేట: మోమిన్ పేట సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జీ వెంకట్ మొదటి సరిగా నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాలు మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

షాబాద్: ఆత్మవిశ్వాసమే ఆయుధంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సూపరింటెండెంట్ రాములు పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మహిళలు వివిధ నైపుణ్యాలను నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో తమ కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి ఉన్నారు.

ఎన్నో ఉద్యమాల ఫలితమే తెలంగాణ



డాక్టర్ ఎన్ గోపాల్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ హిస్టరి డాక్టర్ గోపాల్

కొడంగల్ రూరల్: విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రాజకీయ నాయకులు సంఘటితంగా చేసిన ఉద్యమ పోరాట ఫలితమే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ హిస్టరి డాక్టర్ ఎస్ గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరి ఇంచార్జ్ డాక్టర్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ చరిత్రపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త టి రాంరాబు, అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మర్పల్లి: హాజరైన లబ్ధిదారులు



బంట్వారం: మాట్లాడుతున్న సీడీపీఓ ప్రవీణ

ఎంపీడీఓ రాజమల్లయ్య

మర్పల్లి: దివ్యాంగులకు సంబంధించిన సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజమల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల దరఖాస్తులను సీడీపీఓ ప్రవీణతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వంద శాతం వైకల్యం ఉన్నవారినే ఎంపిక చేస్తామన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల వివరాలను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. పరిశీలన అనంతరం లబ్ధిదారుల ఎంపిక చేస్తామన్నారు. వంద శాతం సబ్సిడీతో ఒక్కో లబ్ధిదారుడికి రూ.50,000 మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

బంట్వారం: సబ్సిడీ బ్యాంకు రుణాల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల దరఖాస్తులను అధికారులు మంగళవారం పరిశీలించారు. బంట్వారం, కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ ప్రవీణ, ఎంపీడీఓలు రాములు, డానియల్ తదితరులు వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ వంద శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులను రుణాల కోసం ఎంపిక చేస్తామన్నారు. ఒక్కో మండలానికి ఒక్కరిని మాత్రమే ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ వార్షికోత్సవం



తిమ్మానగర్‌లో బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

ధారూరు: తిమ్మానగర్ కట్టమైసమ్మ గ్రామ దేవతకు మంగళవారం 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

కళాశాల అడ్మిషన్ల బ్రోచర్ ఆవిష్కరణ



అడ్మిషన్ల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ చంద్రకళ, ప్రిన్సిపాల్ కాంచనలత, అధ్యాపకులు

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు నిపుణులైన అధ్యాపక బృందం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ చంద్రకళ చేతుల మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరుతూ బ్రోచర్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రమేశ్‌బాబు, డాక్టర్ తులసి, తదితరులు ఉన్నారు.